క్లుప్తంగా

ఉపాధ్యాయుడిని అరెస్టు చేయాలి

ఒంగోలు వన్‌టౌన్: కారుమంచిలో దళిత విద్యార్థినిపై లైంగిక దాడి చేసిన జెడ్పీ స్కూల్ ఎన్విరాన్‌మెంట్ ఉపాధ్యాయుడిని అరెస్టు చేయాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. జీజీహెచ్‌లో ఉన్న బాధిత విద్యార్థిని, తల్లిదండ్రులను పరామర్శించేందుకు వెళ్లిన నాగేంద్రంను పోలీసులు అడ్డుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులపై దాడులు, అత్యాచార ఘటనలు పెరిగిపోయాయని, అయినా పోలీసులు కేసులు నమోదు చేయడంలేదన్నారు.

ఇది దారుణం

విద్యార్థినిపై లైంగికదాడి చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే సైదా డిమాండ్ చేశారు. దళిత బాలికను మధ్యాహ్న భోజన సమయంలో తరగతి గదిలోనే లైంగికదాడి చేయడం దారుణమన్నారు. బాలికను పరామర్శించిన అనంతరం, ఉపాధ్యాయుడిని విధుల నుంచి తొలగించాలని డీఈఓకు వినతి పత్రం అందించారు. అనిల్ కుమార్, మల్లిఖార్జున్‌రావు పాల్గొన్నారు.

డీవీ సుబ్బారావుకు ఘన నివాళి



డీవీ సుబ్బారావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న రంగ భూమి కళాకారులు

ఒంగోలు మెట్రో: శ్రీ వీరాంజనేయ నాట్యమండలి ఆధ్వర్యంలో డీవీ సుబ్బారావు 35 వ వర్ధంతి కార్యక్రమాలు శనివారం నెల్లూరు బస్టాండ్ సెంటర్లోని అయన విగ్రహం వద్ద ఘనంగా జరిగాయి.

శ్రీ వీరాంజనేయ నాట్యమండలి కార్యదర్శి

మాక ఆంజనేయులు మాట్లాడుతూ హరిశ్చంద్ర పాత్ర ద్వారా తనకంటూ ఒక గుర్తింపును సాధించుకున్న గొప్ప నటుడు డీవీ సుబ్బారావు అని కొనియాడారు. అంగలకుర్తి ప్రసాద్, ధేనువకొండ సుబ్బయ్య పౌరాణిక రంగస్థల నటులు యేసురత్నం తదితరులు పాల్గొన్నారు.

శిద్దా సూర్య ప్రకాష్‌రావుకు సన్మానం



శిద్దా సూర్యప్రకాష్‌రావును సత్కరిస్తున్న వాసవీ క్లబ్ నాయకులు

సంతనూతలపాడు: వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా పారిశ్రామికవేత్త శిద్దా సూర్య ప్రకాష్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఒంగోలులోని వారి నివాసంలో సంతనూతలపాడు వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ జిల్లా ప్రతినిధులు వేమూరి నాగేంద్ర ప్రసాదరావు, గ్రంధి లక్ష్మీ ప్రసాదరావు, వాసవి క్లబ్ అధ్యక్షుడు వేమూరి వెంకట శేషారావు, ఇతర ఆర్యవైశ్య ప్రముఖులు ఉన్నారు.

వర్క్‌షాపులను విద్యార్థులు ఉపయోగించుకోవాలి



మాట్లాడుతున్న శ్రీధర్

మార్కాపురం: ఇంజినీరింగ్ విద్యార్థులకు మెళకువలను వివరించేందుకు ఏర్పాటు చేసిన వర్క్‌షాపులను ఉపయోగించుకోవాలని కిట్స్ కళాశాల కరస్పాండెంట్ అన్నా కృష్ణ చైతన్య కోరారు. శనివారం కళాశాలలో ప్రముఖ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్స్ కె.ప్రమోద్, శివప్రియ, జి.శ్రీధర్‌లు పాల్గొని విద్యార్థులకు టెర్రాఫాం, గిట్టు, డెవాప్స్, క్లౌడ్ కంప్యూటింగ్, డాకర్ తదితర సాఫ్ట్‌వేర్‌లపై అవగాహన కల్పించారు. ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న ఆధునిక టెక్నాలజీని విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. హెచ్‌ఓడీలు అనీల్‌కుమార్, అమృతవల్లి, రంగనాయకులు పాల్గొన్నారు.



ఒంగోలులో..



శ్రీగిరి గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

కార్తీక మాసం పరమపవిత్రం

- ఈ నెల 15న కార్తీక పౌర్ణమి
- కొత్తపట్నం బీచ్‌లో స్నానమాచరించనున్న దాదాపు 50 వేల మంది భక్తులు



కొత్తపట్నం బీచ్‌లో సముద్ర స్నానం చేస్తున్న భక్తులు (ఫైల్)

కొత్తపట్నం: కార్తీక మాసంలో వేలాదిగా భక్తులు సముద్ర స్నానమాచరించడం శివునికి ప్రీతిపాత్రమైనది. ఈ మాసంలో వచ్చే ఈ రోజులు ఎంతో విశిష్టమైనవి. సూర్యోదయం సమయంలో సముద్ర స్నానం మాచరించి శివ పూజ చేయడం ఆనవాయితీ. జిల్లా వ్యాప్తంగా దేవాలయాల్లో భక్తులు కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేస్తున్నారు. ఈ నెల 15 శుక్రవారం కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని కొత్తపట్నం పల్లెపాలెం సముద్రతీరానికి తరలిరానున్నారు. జిల్లా కేంద్రమైన ఒంగోలుకు అతి సమీపంలో ఉండటంతో దాదాపు 50 వేలమంది వస్తారని అంచనా. జిల్లా చుట్టు పక్కల ఉన్న గ్రామాల్లో వారు కూడా వేకువజామున 4 గంటలకే తరలివస్తారు. స్నానమాచరించి శివాలయానికి చేరుకుని పూజలు చేస్తారు. కొత్తపట్నం బీచ్ ప్రాంతమంతా శివలింగాలతో, తమలపాకులు, అరిటికాయులు, పసుపు, కుంకుమతో నిండిపోతుంది. కానీ ఇప్పటికీ అరకొర వసతులతోనే భక్తులు ఇబ్బంది పడుతున్నారు.

కార్తీకదీప వెలుగులు

ఒంగోలు మెట్రో: కార్తీక మాసంలో మహావిష్ణు జన్మ నక్షత్రం శ్రవణా నక్షత్రం శనివారం కలిసి రావడంతో భక్తులు కోటి సోమవారం పండగ పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. భక్తులు తెల్లవారు జాము నుంచే ఆలయాలకు బారులు తీరారు. శివాలయాలు ముక్కంటి నామస్మరణతో ప్రతిధ్వనించాయి. వైష్ణవ ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ

కార్తీక దామోదర మాసం శ్రవణా నక్షత్రాన్ని కోటి సోమవారంగా పిల్చుకునే పవిత్రమైన రోజు కావడంతో శనివారంఒంగోలు శ్రీగిరి గిరి ప్రదక్షణ కమిటీ ఆధ్వర్యంలో శ్రవణా నక్షత్ర శ్రీగిరి గిరి ప్రదక్షిణ కార్యక్రమం శోభాయమానంగా నిర్వహించారు. శ్రీ బాపూజీ గోసంరక్షణ శాల (గో సంఘం)లో గోపూజ నిర్వహించి సుందరమైన తేరుపై వేంకటేశ్వర స్వామి ప్రతిమను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. భక్తులంతా సామూహికంగా గోవింద నామాలు పఠిస్తూ శ్రీగిరి పై కొలువైన శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించారు. ముందుగా గోపూజ నిర్వహించారు. గోమాత ముందు నడువగా మంగళవాయిద్యాల నడుమ శ్రీగిరి గిరి ప్రదక్షిణ పూర్తి చేశారు. తదుపరి ఆశ్వీజ మాసంలో ఏర్పాటు చేసిన నవ దుర్గా స్తోత్రం.. కార్తీక మాసంలో శ్రీ పార్వతి వల్లభాష్టక పోటీ దారులకు బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా నెమ్మాని హరిప్రియ దేవి.. ఆధ్యాత్మిక ప్రవచన కారులు పొన్నూరు శ్రీనివాసులు వ్యవహరించారు. శ్రీగిరి గిరి ప్రదక్షణ కమిటీ అధ్యక్షులు రాధా రమణ గుప్తా జంధ్యం, సహకార్యదర్శి నేరెళ్ల శ్రీనివాసరావు సభ్యులు ధనిశెట్టి రామునాయుడు, పౌర్ణమితి గిరి ప్రదక్షిణ నిర్వాహకులు బొమ్మిరెడ్డి రాఘవరెడ్డి పాల్గొన్నారు.

మైనంపాడు విద్యార్థులకు అభినందనలు



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న డీఈఓ కిరణ్‌కుమార్

సంతనూతలపాడు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 3,4,5 తేదీల్లో నెల్లూరు జిల్లాలో జరిగిన అండర్ 17 రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను డీఈఓ కిరణ్‌కుమార్ అభినందించారు. మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకుచెందిన విద్యార్థులు టి.శృతి, కె.చరణ్ కుమార్ ప్రతిభ కనబరిచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. హర్యానా రాష్ట్రంలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లోనూ ప్రతిభ చాటాలని కోరారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు టి.రవికుమార్‌ను అభినందించారు. స్కూల్ ప్రధానోపాధ్యాయులు డీవీఎల్ నరసింహారావు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

చిన్నారులు, గర్భిణులకు టీకాలు తప్పనిసరి



వ్యాధి నిరోధక టీకాల ఆవశ్యకతను వివరిస్తున్న డాక్టర్ అప్సర్

చీమకుర్తి రూరల్: గర్భిణులు, చిన్నారులకు నిర్దేశించిన సమయాల్లో వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని డాక్టర్ అప్సర్ తెలిపారు. మండలంలోని బండ్లమూడి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం చిన్నారులకు ఉచితంగా వ్యాధి నిరోధక టీకాలు వేశారు. టీకాలతో ప్రాణాంతక వ్యాధుల నుండి చిన్నారిని రక్షించవచ్చని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోటీకాలపై వైద్య సిబ్బంది ద్వారా నిరంతరం అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ కమల మాట్లాడుతూ టీకా సమయాన్ని ఆశా వర్కర్ల ద్వారా ప్రతి ఇంటికి సమాచారం తెలియజేస్తున్నట్లు చెప్పారు.

వైభవంగా ఆంజనేయస్వామి గ్రామోత్సవం



కంభంలో గ్రామోత్సవం



భక్తుల కోలాటం

కంభం: గుండా ఆంజనేయస్వామి గ్రామోత్సవం శనివారం రాత్రి కంభంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అంకాళమ్మ గుడి వద్ద నుంచి చౌక్‌సెంటర్, జామియా మసీదు సెంటర్, మీదుగా ఆంజనేయస్వామి విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తుల కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

12న మార్కాపురం డివిజన్ శిశు సంరక్షణ శిక్షణ

ఒంగోలు సిటీ: శిశు సంరక్షణ, చట్టాల అవగాహన శిక్షణ కార్యక్రమాన్ని మార్కాపురంలోని టీటీడీ కళ్యాణ మండపంలో ఈ నెల 12న నిర్వహిస్తున్నట్లు డీసీపీఓ దినేష్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ఐసీఈఎస్ సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, ఎం.ఎస్.కెలు, జిల్లా శిశు సంరక్షణ యూనిట్, శిశు సంక్షేమ కమిటీ వంటి ప్రతినిధులు హాజరవుతున్నట్లు చెప్పారు. పిల్లల హక్కుల భాగస్వామ్యం కావడానికి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించండి

గిద్దలూరు రూరల్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి కుమ్మరాంకట్ట సెంటర్ వరకు జాతీయ రహదారికి ఇరువైపులా సైడు కాలువల పై ఉన్న ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించాలని స్థానిక కమిషనర్ డి.వెంకటదాసు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. లేకుంటే 13 వ తేదీ నగర పంచాయతీ వారు కాలువల పై ఉన్న ఆక్రమణలను తొలగింపు చర్యలు చేపడతారని హెచ్చరించారు.

ఉర్దూ భాషాభివృద్ధికి సహకరించాలి

మార్కాపురం: ఉర్దూ భాషాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ (రూటా) జిల్లా అధ్యక్షుడు షేక్ అన్వర్ బాషా కోరారు. శనివారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ ఉర్దూ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి, ఉర్దూ రచయిత డాక్టర్ మహ్మద్ అల్లామా ఇక్బాల్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రూటా అసోసియేట్ ప్రెసిడెంట్ సమీవుల్లా బాషా మాట్లాడుతూ స్వాతంత్య్రోద్యమంలో ఉర్దూ ఆవశ్యకత, కవులు చేసిన సేవలను కొనియాడారు. రాష్ట్రంలో ఉర్దూ రెండో అధికారిక భాషగా ఉందన్నారు. ఉర్దూ భాషాభివృద్ధికి సహకరించాలని కోరారు. జాతికి ఏకం చేసే భాష ఉర్దూభాష అన్నారు. సారే జహాసే అచ్చా గీతాన్ని ఆలపించారు. అన్వర్‌బాషా, సయ్యద్ సమీవుల్లా, పఠాన్ ఇదయతుల్లా ఖాన్, షేక్ బురానీపీరా, షేక్ ఇబ్రహీం పఠాన్ అబ్దుల్ వాహిద్‌ఖాన్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వీరారెడ్డి, ఉర్దూ ఉపాధ్యాయులు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మాదిగల ఆత్మీయ సమ్మేళన సభ రేపు



గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చీమకుర్తి రూరల్: ఒంగోలులో సోమవారం జరిగే మాదిగల ఆత్మీయ సమ్మేళన సభకు ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ వస్తున్నారని ఆ శాఖ జాతీయ నాయకుడు బొంత ఏసుదాసు శనివారం తెలిపారు. మాదిగ జాతి లక్ష్యం అయిన ఎస్సీ వర్గీకరణ కోసం గత 30 సంవత్సరాలుగా అలుపెరగని పోరాటం చేశారన్నారు. తుదకు ఈ ఏడాది ఆగస్టు 1న ఎస్సీ వర్గీకరణ సుప్రీం కోర్టు ద్వారా సాధించుకున్న సందర్భంగా మందకృష్ణ మాదిగ ఒంగోలుకు వస్తున్నారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఈఎఫ్, వీహెచ్‌పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, ప్రజా స్వామ్యవాదులు, అభిమానులు హాజరు కావాలని కోరారు. సభా స్థలం అయిన మున్సిపల్ గ్రాండ్ వద్ద జరిగే మాదిగల ఆత్మీయ సమ్మేళనం సభ జయప్రదం చేయాలని చీమకుర్తి మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు జడ విజయ కుమార్ మాదిగ కోరారు.

సేంద్రియ పొటాష్‌తో అధిక దిగుబడులు



ప్రకృతి సేంద్రియ పొటాష్ తయారు చేసే విధానం వివరిస్తున్న వెంకటేశ్వరరెడ్డి

కొత్తపట్నం: సేంద్రియ పొటాష్ పిచికారీ చేస్తే అధిక దిగుబడులు సాధించడమే కాక చీడ, పీడలను తట్టుకునే శక్తి ఉంటుందని ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జి పిట్టు వెంకటేశ్వరరెడ్డి అన్నారు. రైతు సాధికార సంస్థ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ఆధ్వర్యంలో శనివారం మడనూరులో ప్రకృతి వ్యవసాయం సాగుబడి చేసిన రైతుల కోసం సేంద్రియ పొటాష్ తయారు చేశామన్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ పొటాష్ లోపం నివారించడానికి ప్రకృతి వ్యవసాయం విధానంలో అరటి బోదలు తీసుకుని వాటిని చిన్న చిన్న ముక్కలుగా కోసి డ్రమ్ములో అరటి మొక్కలను.. బెల్లం లేయర్లుగా వేసుకోవాలన్నారు. 25 నుంచి 30 రోజులు ఒక డ్రమ్‌లో వేస్తే ఇది పూర్తిగా తయారు అవుతుందన్నారు. ఇలా తయారు అయిన ద్రావణాన్ని అన్ని రకాల పంటలలో పొటాష్ నివారణ కోసం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఒక ఎకరా విస్తీర్ణంలో అర లీటర్ వరకు వాడుకోవచ్చున్నారు. ప్రధానంగా వరి, చామ, వేరుశనగ, ఆకుకూరలు, కూరకాయలు పంటలలో దీని ప్రభావంతో మంచి దిగుబడులు సాధించవచ్చున్నారు. నరసింహులు వికాస్‌రెడ్డి, సౌమ్య, అదిత్యరామ్, పవన్‌రెడ్డి, ఎస్. రెహమాన్ బాషా, మనోహర్‌రెడ్డి, కాసింబి వెంకటరణ, సుజాత, మహిళా సంఘాల సభ్యులు, ప్రకృతి వ్యవసాయ రైతులు హాజరయ్యారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



ఏబీఎన్ జూనియర్ కళాశాల 1970-72 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

- సందడి చేసిన 1970-72 బ్యాచ్ ఇంటర్ విద్యార్థులు

ఒంగోలు సిటీ: స్థానిక ఏబీఎన్ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక శనివారం ఏబీఎన్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. కళాశాల 1970-72 సంవత్సరం మొదటి బ్యాచ్ ఇంటర్ చదివి 53 సంవత్సరాల తర్వాత హాజరై కళాశాలలో చదువుకున్న కాలంలో తీపి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. అంతా ఎంతో భావోద్వేగాలతో వారి వారి అనుబంధాలను పంచుకున్నారు. ఇలాగే ప్రతి సంవత్సరం హాజరై కళాశాల అభివృద్ధికి తోడ్పాడాలని నిర్ణయించుకున్నారు. ఈ సందర్భంగా అమెరికాలో స్థిరపడిన పూర్వ విద్యార్థి డి.రవీంద్ర వితరణ చేశారు. ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచి ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థికి పదివేల రూపాయలు నగదు బహుమతి ప్రకటించారు. పూర్వ విద్యార్థి ఎం.ఎస్. రవికుమార్ రిటైర్డు ప్రిన్సిపాల్, ఏఓ జయశీలరావు, ప్రిన్సిపాల్ శ్రావణి, ధనరాజ్, జాన్‌విల్సన్, స్రవంతి, ప్రతాప్, మాధవ, అరుణ్, జక్కిరెడ్డి సుబ్బాయమ్మ, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కళాకారులకు అండగా ఉంటాం



మక్కిన థామస్‌కు ఆత్మీయ సత్కారం చేస్తున్న రంగ భూమి కళాకారుల సభ్యులు

ఒంగోలు మెట్రో: జిల్లా రంగభూమి కళాకారుల సంఘం ఒంగోలు వారి ఆధ్వర్యంలో శనివారం ఒంగోలు ఎన్టీఆర్ కళాక్షేత్రంలో సాంస్కృతిక వేడుకగా నిర్వహించారు. 72 సార్లు రక్తదానం చేసి, ఎందరికో ప్రాణదానం చేసిన మక్కిన థామస్కి రంగభూమి కళాకారులచే ఆత్మీయ సత్కారం నిర్వహించారు. చందు డాన్స్ అకాడమీ చిన్నారులు ఈ సత్కార కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీ థామస్ మాట్లాడుతూ రక్తదానం ఎన్నిసార్లు అయినా చేయచ్చని రక్తదానం చేస్తే మనకు ఇబ్బంది అనే అపోహ ఉందని అది నిజం కాదన్నారు. పద్మశ్రీ ఘంటసాల కళా పరిషత్ ఒంగోలు, లక్ష్మీ తులసి బృందం నిర్వహించిన స్వరాభిషేకం ప్రేక్షకులను అలరించింది. బేతంశెట్టి హరిబాబు, అంగలకుర్తి ప్రసాద్, దేనువకొండ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌ఓలు పక్కాగా రిజిస్టర్ నిర్వహించాలి



స్పెషల్ సమ్మరీ రివిజన్ ప్రత్యేక క్యాంపెయిన్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌ఓ ఓబులేసు

- సమ్మరీ రివిజన్ ప్రత్యేక క్యాంపెయిన్‌ను పరిశీలించిన డీఆర్‌ఓ ఓబులేసు

ఒంగోలు అర్బన్: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్పెషల్ సమ్మరీ రివిజన్–2025లో భాగంగా జిల్లాలో నిర్వహిస్తున్న ప్రత్యేక క్యాంపెయిన్‌లో బీఎల్‌ఓలు పక్కాగా రిజిస్టర్ నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఓబులేసు సూచించారు. ఆమేరకు శనివారం నిర్వహిస్తున్న ప్రత్యేక క్యాంపెయిన్‌లను, నగరంలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. బీఎల్‌ఓల బాధ్యతలపై ఆరా తీశారు. సెయింట్ థెరిస్సా కాలేజీలోని పోలింగ్ కేంద్రాలు 108, 110, 111లో బీఎల్‌ఓలు రిజిస్టర్ సక్రమంగా నిర్వహించకపోవడంతో వారికి నోటీసులు జారీ చేయాలని ఎన్నికల విభాగం సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా చూడాలన్నారు. దీనిలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

– వైఎస్సార్ సీపీ తరఫున ఆ పార్టీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్ నగరంలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ప్రత్యేక క్యాంపెయిన్‌లో ఫారం–6,7,8లకు సంబంధించి ఓటర్ల నుంచి వచ్చిన దరఖాస్తులు పరిశీలించారు. పీవీఆర్ బాలికల పాఠశాల, బండ్లమిట్ట ప్రభుత్వ బాలికల పాఠశాల, ఏకేవీకేలో పోలింగ్ కేంద్రాలను దామరాజు పరిశీలించారు.

లక్ష్మీ చెన్నకేశవస్వామికి శాంతి పూజలు



చెన్నకేశవస్వామి మూలవిరాట్

మార్కాపురం టౌన్: పట్టణంలో వెలసిన శ్రీ దేవీ భూదేవీ సమేత శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో చెన్నకేశవస్వామి వారికి ప్రత్యేక శాంతి పూజలు అర్చకులు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, అర్చన, ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు, రంగమాచార్యులు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు అర్చకుడు అరుణ్‌స్వామి నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు చెన్నకేశవ స్వామి ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ప్రత్యేక అలంకారంలో ప్రసన్న వెంకటేశ్వరస్వామి